సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అజంతా పార్కు అభివృద్ధికి కృషి

గోపాలపట్నం: అజంతా పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 92వ వార్డులోని అజంతా పార్కులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తన రాజకీయ జీవితం ఇక్కడి నుంచే ప్రారంభమైందని చెప్పారు. కాలనీలో అద్దెకు ఉన్నానని గుర్తు చేశారు. కాలనీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని తెలిపారు. కాలనీ వాసులు కూడా తనకు అండగా నిలిచారన్నారు. ఏ అవసరం ఉన్నా అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పోర్టు కార్మికుల ధర్నా



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గంగవరం పోర్టు అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గంగవరం పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పైడిరాజు, కొండయ్య, మహ్మద్ నజీర్, దుమ్మెట అప్పారావు, శీత మదన్, వై.కొండయ్య, సోడదాసు సుధాకర్, వి.కృష్ణారావు, బి.జగన్ పాల్గొన్నారు.

29న సమావేశం జయప్రదం చేయాలి

గాజువాక: ఈ నెల 29న గాజువాకలో నిర్వహించనున్న బీజేపీ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని పార్టీ కార్యకర్తలు జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణరాజు కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరు కానున్న సమావేశాన్ని అసెంబ్లీ నియోజకవర్గ శక్తి కేంద్ర ప్రముఖులు, పోలింగ్ బూత్ అధ్యక్షులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. సమావేశం నిర్వహించనున్న పద్మశ్రీ ఫంక్షన్ హాల్‌ను జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు తదితరులతో కలిసి సోమవారం పరిశీలించారు. నాయకులు పుట్ట గంగయ్య, దానేష్‌వర్మ, పాలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలి

సీతమ్మధార: మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని విద్యార్థి, మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మహిళా కళాశాల నుంచి ఎల్ఐసీ భవనం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ హింసాకాండపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే తప్ప, ప్రధాని మోదీ మౌనం వీడకపోవడంపై అనుమానాలు వస్తున్నాయన్నారు. నేరస్తులను శిక్షించి మణిపూర్‌లో శాంతి నెలకొల్పేంత వరకు వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు ఎ.విమల, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అచ్యుతరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు, శేఖర్, సింహాచలం, ఎం.ఎ.బేగం, పద్మ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం



గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం



గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్డులో బస్‌స్టాప్ వద్ద వర్షపు నీటిని తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

గోపాలపట్నం: రెండు రోజులుగా వర్షం దంచి కొడుతోంది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అయితే సోమవారం మధ్యాహ్నం నుంచి అంచెలంచెలుగా కురుస్తూనే ఉంది. వర్షంతో రహదారులు నిండిపోయాయి. బీఆర్‌టీఎస్ రోడ్డులో గోపాలపట్నం బస్ స్టాప్ వద్ద నీరు నిలిచి పోవడంతో పారిశుధ్య కార్మికులు నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పాయి.

దారుణంగా రహదారులు

భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారి మరింత దారుణంగా తయారయింది. ఉదయం పారిశుధ్య అధికారులు కాల్వలు తవ్వేందుకు వెళ్లగా స్థానికులు అడ్డుకున్నారు. ఇక్కడి కాల్వ ప్రారంభమైన దగ్గర నుంచి సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించిన తర్వాత పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. ఎగువ ప్రాంతాల్లో కాల్వలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని అందుకే ఈ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. దీనిపై సమగ్రంగా సర్వే నిర్వహించాలని కోరుతున్నారు.

దోమల నిర్మూలనకు గంబూసియా చేపల పెంపకం



సంపులో గంబూసియా చేపలను వదులుతున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్, ఏఎంహెచ్‌వో సునీల్

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 52వ వార్డు గౌరీనగర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంపులో గంబూసియా చేపల పెంపకాన్ని సోమవారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపల వల్ల డెంగ్యూ, మలేరియా వ్యాధికారక దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. దోమలు మంచి నీటిలో గుడ్లు పెడతాయని, అవి కొద్ది కాలంలోనే లార్వాగా మారుతాయన్నారు. ఈ లార్వాను గంబూసియా చేపలు ఆహారంగా స్వీకరిస్తాయని, తద్వారా దోమల వృద్ధి ఆగిపోతుందని వివరించారు. ఇళ్లల్లో కూడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జియ్యాని శ్రీధర్ సూచించారు. కార్యక్రమంలో జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



పార్టీ అధ్యక్షుడు కోలా గురువులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఎస్ కృష్ణ

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులును సోమవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. గురువులుకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రేమ విఫలమై...

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ జీడీ బాబు

మల్కాపురం: ప్రేమ విఫలమైందన్న కారణంతో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్న యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లా, ఖద్దిఖుర్ ప్రాంతానికి చెందిన శివకుమార్ సాహు (22) స్థానికం ఓ సంస్థలో లారీ డ్రైవర్‌గా గత నెలలో చేరాడు. లారీలో కోరమాండల్ సంస్థకు సోమవారం ఉదయం సరుకు తీసుకువచ్చాడు. సంస్థ శివారు ప్రాంతం గేటు నెంబర్ 10 వద్ద (శ్రావణి షిప్పింగ్ ఏరియా ఉన్న గేటు) లారీని నిలిపి అక్కడి బాత్‌రూమ్‌లోకి వెళ్లి కిటికీ ఇనుప తీగలకు తువాలు (టవల్)తో ఉరి పోసుకున్నాడు. ఆ సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లిన కొంత మంది డ్రైవర్లు ఈ ఘటనను చూసి అక్కడి సెక్యూరిటీ అధికారులకు వివరించారు. వారు మల్కాపురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జి.డి.బాబు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. ఈ ఘటనపై మృతుడికి సోదరుడు వరుస అయిన పుష్పేంద్రకుమార్ సాహు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన సీఐ జి.డి.బాబు శివకుమార్‌సాహు ప్రేమ విఫలం కారణంగా ఉరి వేసుకున్నట్టు తమ విచారణలో తేలిందన్నారు.

3న జోన్–3లో బహిరంగ వేలం

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలకు ఆగస్టు 3వ తేదీ ఉదయం 11 గంటలకు ఆశీలుమెట్ట జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ దొండపర్తి కల్యాణ మండపం, డైమండ్ పార్కు వాణిజ్య సముదాయంలోని మొదటి అంతస్తులో గల దుకాణాల నంబర్లు 8, 9, ఆశీలు మెట్ట వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబర్ 3, ఎంవీపీ వాణిజ్య సముదాయంలోని 7, 10, 13, 14 నంబరు దుకాణాలు, జగ్గారావు బ్రిడ్జి వద్ద వాణిజ్య సముదాయంలోని దుకాణం నంబరు 6(పీహెచ్ కోటా), సీతమ్మధార పాత వాణిజ్య సముదాయంలోని 15 నంబర్ దుకాణం(ఎస్సీ)కు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంస్థలు వేలంలో పాల్గొనాలని జెడ్సీ కోరారు. వివరాలకు జీవీఎంసీ జోన్–3 కార్యాలయ పనివేళల్లో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని చెప్పారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు ఘన నివాళి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దత్తి అప్పలనాయుడు, పాఠకులు

మురళీనగర్: పుస్తక పఠనానికి ప్రాధాన్యమివ్వడం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ ఉద్యమకారుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, స్వాతంత్ర సమరయోధుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ స్థాపనకు అయ్యంకి చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. విద్యార్థులు ప్రతి రోజు లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షలకు చదువుకునేందుకు అవసరమైన మెటీరియల్ గ్రంథాలయాల్లో లభ్యమవుతుందని చెప్పారు. పైసా ఖర్చు లేకుండా అన్ని రంగాలకు చెందిన గ్రంథాలు, పుస్తకాలు ఇక్కడ లభ్యమవుతాయన్నారు. డిజిటల్ పుస్తకాల కన్నా గ్రంథాలయాల్లో భౌతికంగా లభించే పుస్తకాలు చదవడం మంచిదని సూచించారు. విద్యార్థులతో పద్య పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.పద్మజ, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు.



సేవలు చిరస్మరణీయం

పెదగంట్యాడ: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు మరువలేమని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ అన్నారు. శాఖా గ్రంథాలయంలో అయ్యంకి జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్, రాంబాబు, రమేష్, వేణు, ప్రసాద్, పురుషోత్తమ, హరి, అర్జున్ పాల్గొన్నారు.

చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన నేడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ప్రవాస భారతీయురాలు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు తెలిపారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాలో స్థిరపడిన శ్రావణి చిన్నతనం నుంచి కళలపై ఆసక్తితో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారన్నారు. డీసీఎంఎస్ విభాగంలో ఉదయం 11 నుంచి రెండు గంటల పాటు శ్రావణి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. నృత్య కళాకారిణి శ్రావణి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఏయూలో నృత్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. గణేష పంచరత్నం, కామాక్షి స్తుతి, బ్రహ్మకడిగిన పాదం, శివతాండవ స్తోత్రం, జావళి ప్రదర్శిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య సి.ఎస్.రావు, విజయవేణి, రాజశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

దయా స్వరూపిణి లలితాదేవి



ప్రవచిస్తున్న రమ్యానంద భారతీ మాతాజీ

సీతంపేట: జగన్మాత, దయా స్వరూపిణి అయిన లలితాదేవి ఎంతో శక్తి కలదని శ్రీ శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ మాతాజీ అన్నారు. లలితాపీఠంలో వారం రోజుల పాటు జరగనున్న లలితాలహరి ప్రవచనాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు జగన్మాత అయిన లలితాదేవి మహత్యం, ఉపాసన విధానం, మంత్ర రహస్యం, సహస్ర నామ పారాయణ పుట్టుక, విశిష్టత, శక్తి, అందులో దాగి ఉన్న మంత్ర రహస్యం, సత్ఫలితాలను భక్తులకు వివరించారు. అమ్మవారి సన్నిధిలో, చాతుర్మాస దీక్షలో ఉన్న జగద్గురువు సమక్షంలో లలితా సహస్ర నామ పారాయణ చేయడం వల్ల అమ్మ అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుందన్నారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో జరిగిన ఈ ప్రవచన పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులంతా అమ్మవారికి పూజలు చేశారు.

వైభవంగా బంగారమ్మ తొలేళ్ల ఉత్సవం



వీధిలో పూలజంగడి ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల పండగ నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వీధుల్లో పూలఘటాలు తిరిగాయి. సాయంత్రం బంగారమ్మకు సారె సమర్పించారు. రాత్రి 7 గంటలకు వీధుల్లో కూటి ఘటాలు తిప్పారు. కళావేదిక ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన పండగ, అనుపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ చందక అప్పలరాజు తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, పూలఘటాలు, కూటిఘటాల ఊరేగింపు ఉంటుందన్నారు. అనుపు సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి అమ్మవారి ప్రభల ఊరేగింపు ఉంటుందని తెలియజేశారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 అర్జీలు అందాయి. ప్రజల వాటిని జెడ్సీ స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీలు చిరంజీవి, పద్మావతి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో వసతులు కల్పిస్తాం

కార్పొరేటర్ కొణతాల సుధ



డీఈ ఏడుకొండలుకు మార్కెట్ సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులకు అవసరమైన వసతులు కల్పిస్తామని కార్పొరేటర్ కొణతాల సుధ చెప్పారు. జీవీఎంసీ వర్క్స్ డీఈ ఏడుకొండలుతో కలిసి ఆమె సోమవారం మార్కెట్ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ పలువురు కూరగాయలు,ఆకుకూరలు,మాంసం వంటివి విక్రయిస్తున్నారని చెప్పారు. అయితే వర్షాలు పడితే వ్యాపారాలు సాగక ఇబ్బంది పడుతున్నారని, మార్కెట్ ప్రదేశంలో శ్లాబ్ వేయడంతో పాటు విద్యుత్ లైట్లు అమర్చాలని సూచించారు. మంచినీరు,మరుగుదొడ్డి సదుపాయం కల్పించాలన్నారు. ఈ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈ ఏడుకొండలుకు సూచించారు. ఆ ప్రతిపాదనలను జీవీఎంసీ కమిషనర్,నగర మేయర్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భోగవల్లి నాగభూషణం,పెంటారావు,ఉరుకూటి బాబూరావు,సత్యాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించండి

జీవీఎంసీ 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ సోమవారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవితో కలిసి తొలిత వెంకన్నపాలెంలో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక మహిళలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. చెత్త ఎప్పటికప్పుడు తీసుకెళ్లడం లేదని.. కాలువల్లో పూడికలు తొలగించడం లేదన్నారు. దీనిపై స్పందించిన ఆమె తక్షణం కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు తొలగించాలని శానిటరీ అధికారికి సూచించారు.అనంతరం ఆమె మల్కాపురం,ప్రకాష్‌నగర్,జనతాకాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



ప్రకాష్‌నగర్‌లో ఓ ఇంటి ముందు ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వీధుల్లో భవనాలకు అంటుకుని విద్యుత్ వైర్లు ఉన్నాయి. దీంతో ఆయా భవనాల యజమానులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో చాలా వీధులు ఇరుగ్గా ఉంటాయి. ఆ వీధుల్లో విద్యుత్ శాఖ అధికారులు సీసీ,ఇనుప స్తంభాలు ఏర్పాటు చేసి వాటికి ఎల్‌టీ విద్యుత్ వైర్లు అమర్చారు. అయితే ఇనుము స్తంభాలకు యాంగిలర్స్ అమర్చి వాటి ద్వారా ఎల్‌టీ లైన్లు, వాటికి ఇంటి అవసరాలకు వాడే వైర్లు అమర్చాలి. ఇలా అయితే వైర్లు భవనాలకు రాసుకోవు. అయితే అధికారులు మామూలుగా లైన్లు వేయడంతో వైర్లు భవనాలకు రాసుకుంటున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో వైర్లు తడిసిన భవనాలకు రాసుకుంటే పెను ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించాలని మల్కాపురం,ప్రకాష్‌నగర్ తదితర ప్రాంత నివాసీయులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



893వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కార్మిక సంక్షేమానికి చేటు అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 893వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడితే, మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయి ప్రజలపై పన్నుల భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేదంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్ వరప్రసాద్ తదితరులు

ఏయూ క్యాంపస్: సంస్థలో వ్యక్తి ప్రగతికి కార్యనిర్వాహక నైపుణ్యాలు కీలకంగా నిలుస్తాయని డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్(హెచ్ఆర్) కె.ఎస్.వరప్రసాద్ అన్నారు. సోమవారం ఐఐఎం విశాఖపట్నం ఏయూ ప్రాంగణంలో డీఆర్‌డీవో శాస్త్రవేత్తలకు 'ప్రాజెక్ట్ అన్‌సెర్టెనిటీ–రిస్క్ మేనేజ్‌మెంట్ అంశంపై'ఐదు రోజుల పాటు జరిగే సామర్థ్యాల నిర్వహణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో ప్రాజెక్టుల నిర్వహణ, పూర్తి చేయడం ఎంతో అవసరమన్నారు. విభిన్న సంస్థలు, విభాగాలతో అనుసంధానంగా పని చేయడం, మానవ వనరుల సమర్థ నిర్వహణను వివరించారు. భవిష్యత్తులో ఆటోమేషన్ ఏఐ సాంకేతికతలు ప్రముఖ భూమిక పోషిస్తాయని, సాంకేతికత విస్తృతిని ముందుగా అంచనా వేస్తూ సాగాలన్నారు. అదే విధంగా ఎస్ఏడీకి చెందిన ఐఎస్ఏఎస్ అధికారులకు ఆరు రోజుల ఇండక్షన్ ప్రోగ్రాంని ప్రారంభించారు. ఆచార్య బి.శ్రీరంగాచార్యులు డీఆర్‌డీవో శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని అడ్మినిస్ట్రేషన్ డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రోహిత్ తిత్యాల్, ఆచార్య బాలాజి సుబ్రహ్మణియన్, తదితరులు పాల్గొన్నారు.